WANTED
జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.
తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.
సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhinews
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
సంపుటి:1
సంచిక:85
ఆదివారం,
01.12.2024

# రైతుపండుగ సభ కాదు..
# రైతులకు బెదిరింపు సభ

- భూములు ఇవ్వకున్నా గుంజుకుంటామని సీఎం బెదిరిస్తున్నారు
- పాలమూరుపై ప్రేమ ఉంటే ఏడాది పాటు ఏం చేశావ్
- పాలమూరు ప్రాజెక్టులో తట్టెడు మట్టి ఎత్తింది లేదు
- సీఎం ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందలా సాగింది
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం



వారధి న్యూస్, వనపర్తి:

ఏడాది పాలన సందర్భంగా మహబూబ్‌నగర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన రైతు పండుగ సభపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతు పండుగ పేరుతో కొడంగల్ లో భూములు ఇవ్వకుండా గిరిజన

..మిగతా 2 లో



# వణికిస్తున్న 'ఫెయింజల్' తుపాన్

- తమిళనాడు అతలాకుతలం
- తీరప్రాంతం మొత్తం గజగజ
- చెన్నైలోని అనేక ప్రాంతాలు జలమయం
- ఎయిర్ పోర్ట్ తాత్కాలికంగా క్లోజ్

వారధి, నేషనల్ బ్యూరో:

బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారడంతో తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. పుదుచ్చేరి, తమిళనాడు తీరాల వైపు బలంగా దూసుకొస్తున్న ఈ 'ఫెయింజల్' తుపాను.. తీరాన్ని తాకింది. దీంతో తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నై లో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాల కారణంగా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు

..మిగతా 2 లో





# రుణమాఫీతో సరికొత్త రికార్డు

## రైతుల మేలు కోసం దేనికైనా రెడీ

- ఏడాదిలో రూ.54 వేల కోట్లు ఖర్చు చేశాం
- 25 లక్షల మందికి రూ.21వేల కోట్ల రుణమాఫీ
- దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఇలా జరిగిందా..?
- రుణమాఫీపై మోడీ, కేసీఆర్‌తో చర్చకు సిద్ధం
- దేశంలో సాగుకు ఉచిత విద్యుత్తు పేటెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానిదే
- పాలమూరు ప్రగతికి కేసీఆర్ కుటుంబం మోకాలడ్డు
- మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి 20 లక్షల ఎకరాలకు నీరిస్తా
- ఐదేళ్లలో ఈ ప్రాంతానికి రూ.లక్ష కోట్లు తెస్తా
- ప్రతిపక్షాల మాయలో పడి అభివృద్ధిని అడ్డుకోవద్దు
- రైతు పండుగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

*రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ఏడాది వ్యవధిలో రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రూ.21 వేల కోట్లతో 25 లక్షల మందికి రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందని తెలిపారు. వరి వేస్తే ఉరి అని అప్పట్లో కేసీఆర్ అంటే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం విక్రయించిన 3 రోజుల్లో రూ.500 బోనస్.. రైతుల ఖాతాల్లోకి కనకవర్షంలా వస్తుంటే.. భారాస నాయకుల గుండెల్లో పిడుగులు పడుతున్నాయన్నారు. 'కాళేశ్వరం' నుంచి చుక్కనీరు ఎత్తిపోయకున్నప్పటికీ.. నాటి ప్రాజెక్టుల నీటితో రికార్డుస్థాయిలో 1.53 కోట్ల టన్నుల ధాన్యం పండిందన్నారు. ఎసైన్డ్ భూములు, కనీస మద్దతు ధర, దేశంలో రైతులకు ఉచిత విద్యుత్తు, రుణమాఫీ అందించడం కాంగ్రెస్ పేటెంట్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో శనివారం రైతుపండగ ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.*

వారధి, స్టేట్ బ్యూరో:

రైతుల కోసం ఇంకా సొమ్ము అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నవంబర్ 30వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉందన్న ఆయన, సరిగ్గా ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కోసం ఉత్సాహంగా ఓట్లు వేసి నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దింపారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు జేసిన వారి మాయ మాటలు నమ్మి అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని

..మిగతా 2 లో




## కేజ్రీవాల్‌పై లిక్విడ్ ఎటాక్

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- మాజీ సీఎంకు భద్రత లేదని ఆప్ నేతల ఆగ్రహం

2 లో

# రాజకీయాలకు కేటీఆర్ బ్రేక్

- బీఆర్ఎస్ పార్టీలో కీలక మార్పులు
- రాజకీయాలకు విరామం ప్రకటిస్తున్నా
- ప్రత్యర్థులు నన్ను అంతగా మిస్ కారని భావిస్తున్నా
- ట్విట్టర్‌లో కేటీఆర్ సంచలన ప్రకటన
- సడన్‌గా బ్రేక్ ఇవ్వడంపై బీఆర్ఎస్‌లో ఆందోళన



వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ పాలిటిక్స్ రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో త్వరలో కీలక మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం ఏమేమి చేసిందో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు.. ఈ విజయోత్సవాలను రేవంత్ రెడ్డి సర్కార్ వందశాతం

..మిగతా 2 లో

# మాయమాటలతో మరోసారి మోసం

- రైతాంగాన్ని ఉసూరుమనిపించిన రైతుపండుగ
- రేవంత్ గొప్పలు చూస్తే నవ్వొస్తోంది
- అసెంబ్లీకి రమ్మని తెగ పిలుస్తున్నావు కదా..
- మేమూ ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్నాం..
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు కౌంటర్



2 లో



## లగచర్లలో మళ్లీ భూసేకరణ

- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సర్కారు నిర్ణయం
- లగచర్లలో 110.2, పోలేపల్లిలో 71.9 ఎకరాల సేకరణ

3 లో

# వరంగల్‌లో కొండా కుటుంబం అఘాయిత్యాలు



- ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి
- కొండా సురేఖ స్థాయికి నేను దిగజారలేదు
- ఆమెకు మంత్రి పదవిలో ఉండే అర్హత లేదు
- ఆధారాలుంటే నన్ను జైలుకు పంపండి
- కుట్ర కోణంపై సీబీఐ ఎంక్వైరీ వేయండి
- నాపై అభాండాలు వేస్తే ఊరుకోను
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

2 లో



## టీజీపీఎస్సీ ఛైర్మన్ గా బుర్రా వెంకటేశం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

2 లో

## నీటి పారుదల శాఖలో అవినీతి తిమింగలం

- పదేళ్లలో రూ.150 కోట్ల లంచాలు
- ఏసీబీ వలకు చిక్కిన ఏఈఈ నిఖేష్
- 33 చోట్ల అధికారుల సోదాలు
- దాదాపు రూ.150 కోట్లకు పైగా ఆస్తులు



2 లో

# రైతుపండుగ సభ కాదు..
# రైతులకు బెదిరింపు సభ

మొదటిపేజీ తరువాయి

రైతులు ఎదురు తిరిగినందుకు రాష్ట్రంలోని రైతులను బెదిరించేందుకు ఈ సభ పెట్టినట్లుందని విమర్శించారు. మీరు ఇవ్వకున్నా నేను గుంజుకోవడం ఖాయం అని రేవంత్ బహిరంగంగా బెదిరిస్తున్నారన్నారు. పాలమూరు మీద ప్రేమ ఉంటే ఏడాది కాలాన్ని ఎందుకు హారతి కర్పూరంలా కరిగించావని.. ఏడాదిగా రేవంత్ కు పాలమూరు మీద ధ్యాసనే లేదన్నారు. రేవంత్ జరుపుతున్న సంబరాలు చూసి ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారని.. నిజంగానే ఆయనకు చిత్తశుద్ధి ఉంటే నిమిష, నిమిషం కృష్ణానీళ్లను ఒడిసిపట్టి ఉండేవాడన్నారు. అది లేకనే ఈ ఏడాది కృష్ణా నీళ్లను అవకాశం ఉన్నా వాడుకోలేక సముద్రం పాలు చేశారన్నారు. పాలమూరు తపన, పాలమూరు ధ్యాస, పాలమూరు వేదన ఎక్కడా రేవంత్‌లో ప్రజలకు కనిపించలేదన్నారు. రేవంత్ సీఎం అయ్యాక ఏడాది పాలనలో పాలమూరు జిల్లాలో తట్టెడు మట్టి ఎత్తింది లేదని.. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పాలన అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు పచ్చబడిందని.. ఏడాది కాంగ్రెస్ పాలనలో పాలమూరు మళ్లీ వెనకబడిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పడావుపెట్టి ఏడాది కావస్తుందని.. వట్టెం పంప్ హౌస్ మునిగితే ఇప్పటివరకు ఒక్క మంత్రి ఇటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. నేను పాలమూరు బిడ్డను, నాకు బాధ్యత ఉంది అంటూ రేవంత్ హూంకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేవంత్ కు పాలమూరు బాధ తెల్వదు, సీఎంగా బాధ్యత కూడా లేదన్నారు. రైతుపండగ పేరుతో వందల కోట్లు దుర్వినియోగం చేశారని.. ఆర్టీసీ బస్సులను మళ్లించి ప్రజలకు రవాణా సౌకర్యం లేకుండా చేశారని మండిపడ్డారు. కార్తీకమాసం శ్రీశైలం వెళ్లే భక్తులు బస్సులు లేక బస్టాండ్లలో అవస్థలు పెట్టారు.. ఇప్పటికైనా రేవంత్ కు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పెండింగ్ 10 శాతం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కోసం సరిగ్గా ఏడాది సమయం కష్టపడితే జిల్లాలో అదనంగా మరో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని సభ సాక్షిగా రేవంత్ ఒప్పుకున్నాడన్నారు. కాంగ్రెస్ కుట్రలను చేధించి కేసీఆర్ పాలమూరు ఎత్తిపోతల పనులను పూర్తి చేశారని.. మిగిలిపోయిన పనులను పూర్తి చేసి రిజర్వాయర్లను నీటితో నింపాలన్నారు. పాలమూరు సభలో రేవంత్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందలా సాగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

# వణికిస్తున్న 'ఫెయింజల్' తుపాన్

మొదటిపేజీ తరువాయి

కురుస్తుండటంతో శనివారం రాత్రి 7 గంటల వరకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే శుక్రవారం నుంచి విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు పలు ఎయిర్‌లైన్లు ప్రకటించాయి. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. తాజాగా ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేయడంతో అవస్థలు పడుతున్నారు.

# రాజకీయాలకు కేటీఆర్ బ్రేక్

మొదటిపేజీ తరువాయి

వినియోగించుకుంటోంది. అయితే.. ఇలాంటి పీక్ టైంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిమ్మతిరిగే ట్విస్ట్ ఇచ్చారు. కేటీఆర్.. ఆకస్మాత్తుగా రాజకీయాలకు విరామం ప్రకటించడం పొలిటికల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


'కొన్ని రోజుల పాటు విరామం తీసుకుంటున్నా. నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను అంతగా మిస్ కారని భావిస్తున్నా' అని కేటీఆర్ ట్వీట్ చేయడం కలకలం రేపింది. అసలు ఏమైంది? ఉన్నపళంగా విరామం ఎందుకు తీసుకున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కేటీఆర్ చేసిన ఈ ట్వీట్‌పై అటు బీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు, మిగతా నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## వరంగల్‌లో కొండా కుటుంబం
# అఘాయిత్యాలు

వారధి, స్టేట్ బ్యూరో:

గురుకులాల్లో కుట్రల వెనుక బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందంటూ మొన్న మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. ఈ నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పందించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గురుకులాల కార్యదర్శిగా తాను పని చేసిన సమయంలో అవినీతి జరిగి ఉంటే ప్రభుత్వం విచారణ చేసి తనను జైలుకు పంపవచ్చని బీఆర్ఎస్ నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట పడతామంటే, సమస్యలు పరిష్కరించాల్సింది పోయి మతిస్తిమితం లేని నేతలు తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కొండా సురేఖ స్థాయికి తాను దిగజారలేనని, వారికి మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. కుట్ర చేసి విషాహారం అని మాతృమూర్తిగా ఇలా మాట్లాడతారా? అని ప్రశ్నించిన ప్రవీణ్ కుమార్, వరంగల్‌లో కొండా కుటుంబం చేసిన అఘాయిత్యాలతో ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఆరోపించారు. నేర చరిత్ర పెట్టుకొని కొండా సురేఖ తమపై అభాండాలు వేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మంత్రి సీతక్క మూలాలు మరచి మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆక్షేపించారు. తాను అవినీతి చేసినట్లు ఆధారాలు ఉంటే సీబీఐ విచారణ చేయించండని సవాల్ విసిరారు. గురుకులాలపై తాము కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేశారని ఆరోపించారు. కుట్ర ఎవరు చేస్తున్నారో బయటపెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా మారడం లేదన్న ప్రవీణ్ కుమార్, చేతకాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్‌కు అప్పగించాలని అన్నారు.







# రుణమాఫీతో సరికొత్త రికార్డు

మొదటిపేజీ తరువాయి

మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. 70 ఏళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కొడంగల్‌లో పారిశ్రామిక వాడ నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు. కానీ కొంతమది లగచర్లలో చిచ్చు పెట్టి అమాయక లంబాడాలను జైల్లో పెట్టించారని మండిపడ్డారు. వాళ్ల మాయమాటలు నమ్మి అమాయక ప్రజలు జైలుకు వెళ్లారని, దయచేసి వాళ్ల మాటలు నమ్మొద్దని చెప్పారు. దేశంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు. తెలంగాణలో రైతుల కోసం ఇప్పటి వరకు ప్రజాప్రభుత్వం రూ.54 వేల కోట్లు ఖర్చు పెట్టిందని చెప్పారు. 'ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనది. సరిగ్గా ఏడాది క్రితం మీరంతా ప్రజా ప్రభుత్వం కోసం ఉత్సాహంగా ఓట్లు వేశారు. నిరంకుశ ప్రభుత్వాన్ని దింపి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణమ్మ పారుతున్నా జిల్లా ప్రజల కష్టాలు తీరలేదు. ఉపాధి కోసం ఎన్నో కుటుంబాలు ముంబై, హైదరాబాద్‌కు వలస పోయాయి. బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యాడు. మీ పాలమూరు బిడ్డనే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఎవరి దయా దాక్షిణ్యాలు మనకు అవసరం లేదు. వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకుందామా? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మనం పూర్తి చేసుకోవద్దా? ఒకే సంతకంతో మన జిల్లాకు కావాల్సిన అన్ని తెచ్చుకుందాం. ఏడాదికొక రూ. 20వేల కోట్లు మా జిల్లాకు ఇవ్వాలని మీ తరఫున మా మంత్రి వర్గాన్ని నేను అడుగుతా' అని సీఎం రేవంత్ అన్నారు.

**మోదీ, కేసీఆర్‌కు సవాల్..**

రైతు రుమాఫీ, బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతుంటే బీఆర్ఎస్ గుండెల్లో పిడుగులు పడుతున్నాయని సీఎం రేవంత్ అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఒకొక్కరుగా వస్తారో, అందరూ కలిసి వస్తారో రండి. అసెంబ్లీలో చర్చిద్దామని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తి చేసిందా? వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని గత సీఎం అనలేదా? ఈ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి వరి రైతులకు పండుగ తెచ్చింది. గత ప్రభుత్వం రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టింది. మూడేళ్లు నిండకుండానే ఆ ప్రాజెక్టు కూలింది. ఈ ఏడాది రాష్ట్రంలో 1.50లక్షల మెట్రిక్ టన్నుల వరి పండింది. గత ప్రభుత్వం వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసింది. ఏడాదిలో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే అన్నారు.

**పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

ఆనాడు పాలమూరును దత్తత తీసుకుంటా అని కేసీఆర్ అన్నాడు. కానీ పదేళ్ల ఆయన పాలనలో జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. ఇవాళ మేం నారాయణ్ పేట్ కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తామంటే మాత్రం కాళ్లల్లో కట్టెలు పెడుతుండు. పాలమూరుకు నీళ్లు తెస్తామంటే కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు అడ్డు పడుతున్నారని మండిపడ్డారు. అలాగే పారిశ్రామిక వాడ తెచ్చి 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే జిమ్మేదారి తనదేనని హామీ ఇచ్చారు. మీ కుట్రలు, కుతంత్రాలకు నేను బెదిరేవాణ్ణి కాదు. తోడేళ్ళు, పులులు ఎన్నో చూశా. మానవ మృగాలు మీరెంత. పని చేయడమే మనకు తెలుసు. పనిలోపడి చేసింది చెప్పుకోలేకపోతున్నాం. మాకు ఏ బ్రాండ్ అంబాసిడర్లు అవసరం లేదు.. మీరే మా బ్రాండ్ అంబాసిడర్స్. ఒక్కొక్క యువకుడు ఒక రేవంత్ రెడ్డిగా మారి అభివృద్ధిని ప్రజలకు చేర్చండి. నేను మీవాణ్ణి.. నన్ను ఆశీర్వదించండి. కుట్రలను కుతంత్రాలను తిప్పి కొట్టండి. పాలమూరులో 20 లక్షల ఎకరాలకు నీళ్లు తెచ్చే బాధ్యత నాదంటూ భావోద్వేగంగా ప్రసంగించారు.

**జిల్లాకు లక్ష కోట్లు తీసుకొస్తా..**

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చెప్పే మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. ఇంటికో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం తలరాత మారుతుంది. నష్టపరిహారం ఎక్కువ ఇచ్చేందుకైనా సిద్ధంగా ఉన్నాం. కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉంది. కానీ, పరిశ్రమల కోసం మాత్రం 1300 ఎకరాల భూమి సేకరించొద్దా. పాలమూరు ప్రజలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**కాళ్లల్లో కట్టెలు పెడుతున్న బీఆర్ఎస్**

'నేను.. పాలమూరు జిల్లా నల్లమల కొండారెడ్డిపల్లిలో పుట్టిన బిడ్డను.. పుల్లలను చూసిన.. మృగాలను చూసిన.. తోడేళ్లను చూసిన.. మానవ మృగాలు మీరెంత..!? నా కాలి గోటికి కూడా సరిపోరు' అంటూ విపక్షాలపై సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి విషయమలో బీఆర్ఎస్ నాయకులు కాళ్లల్లో కట్టెలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నేను.. దేనికీ లొంగేవాడిని కాదు.. తొక్కుకుంటూ ఇందాక వచ్చాను.. పాలమూరు అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకుంటానా' అని కీలక వ్యాఖ్యలు చేశారు. '70 ఏళ్ల తర్వాత ఈ ప్రాంత బిడ్డనైన నాకు ముఖ్యమంత్రిని అయ్యే అవకాశం లభించింది. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేసుకొని 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తా' అని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలో అగ్గి పెట్టే రావు (హరీష్ రావు) మాటలు విని కొంతమంది రెచ్చిపోయి అధికారులపై దాడులకు పాల్పడ్డారు అని చెప్పారు. ఇప్పుడు కొంతమంది వచ్చి కేసులు తీసివేయమంటున్నారు.. నాపైనే 182 కేసులు ఉన్నాయి.. కేసులు వేరు.. ముఖ్యమంత్రి సీటు వేరు అని ఆయన వెల్లడించారు.. ప్రతిపక్ష పార్టీల నాయకుల ఉచ్చులో పడకండి.. ఈ జిల్లా బిడ్డగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# మాయమాటలతో మరోసారి మోసం

వారధి, స్టేట్ బ్యూరో:

మహబూబ్‌నగర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా పోస్టు పెట్టారు. రైతు పండుగలో సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు ఎంత మొత్తుకున్నా దండగే అయ్యిందని విమర్శించారు. ఆడంబరంగా నిర్వహించిన కార్యక్రమం యావత్ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరుమనిపించిందని ఎద్దేవా చేశారు. ఏడాది పూర్తయిన సందర్భంగానైనా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు 15వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చెయ్యి చూపారని అన్నారు. ఇక కౌలు రైతులు, ఉపాధి కూలీలకు రైతు బంధుకు అతీగతీ లేదని విమర్శించారు. రైతు పండుగ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రైతులను మాయమాటలతో మరోసారి మోసం చేశారని అన్నారు. కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ పేటెంటే అంటూ గప్పాలు కొట్టుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కాదు, మా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే కోటి 53 లక్షల టన్నుల వరి పండిందని గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. మీరు చెప్పిన ప్రాజెక్టులు 2014లో కూడా ఉన్నాయి. మరి అప్పుడు 68 లక్షల టన్నుల వరి మాత్రమే ఎందుకు పండింది రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. 202324 నాటికి కోటి 68 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి ఎలా సాధ్యం అయ్యింది? అని అడిగారు. 201415లో లక్షా 31 వేల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2 లక్షల 21 వేల ఎకరాలకు ఎలా పెరిగింది? అని అన్నారు. చెప్పేవాడికి ఇంగితం లేకున్నా వినేవాడికైనా వివేకం ఉంటది అని తెలిపారు. అభివృద్ధి జరగాలంటే రైతులు నష్టపోవాలని చెబుతున్నారు..

# నీటి పారుదల శాఖలో అవినీతి తిమింగలం

వారధి, స్టేట్ బ్యూరో:

అవినీతి నిరోధక శాఖకు ఓ అవినీతి తిమింగలం చిక్కింది. ఇరిగేషన్ ఏఈ నికేష్ ఇంట్లో ఏసీబీ సోదాల్లో పెద్ద ఎత్తున అక్రమాస్తులు బయటపడుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా నికేష్‌కు చెందిన 33 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.150 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. మూడు ఫామ్‌హౌస్‌లతో పాటు మూడు విల్లాలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఎకరాల కొద్దీ ల్యాండ్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని చెరువులు, వాటి పరిసర ప్రాంతాల పరిరక్షణ పర్యవేక్షణ అధికారిగా నికేష్ పనిచేశారు.

ప్రస్తుతం నికేష్ సస్పెన్షన్‌లో ఉన్నాడు. 6 నెలల క్రితం లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఏఈ నికేష్ పట్టుబడ్డాడు. రెడ్‌హిల్స్‌లోని రంగారెడ్డి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో 6 నెలల క్రితం ఏసీబీ రైడ్ చేసింది. ఒక అనుమతి కోసం దరఖాస్తుదారుడి నుంచి అధికారులు రూ.2 లక్షల 50 వేలు డిమాండ్ చేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీకి ఈఈ బన్సీలాల్, ఏఈలు కార్తీక్, నిఖేష్‌లు పట్టుబడ్డారు. అప్పటి నుంచి నికేష్ సస్పెన్షన్‌లో ఉన్నాడు. సస్పెన్షన్‌లో ఉన్న నికేష్ ఆస్తులపై ఏసీబీ అధికారులు కూపీ లాగగా.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. ఉదయం నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున డబ్బు, నగలు, బంగారు ఆభరణాలు గుర్తించారు. కోట్ల విలువైన భూములకు చెందిన డాక్యుమెంట్లు.. బినామీ పేర్లతో, కుటుంబ సభ్యులు, బంధువుల పేర్ల మీద కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# కేజ్రీవాల్‌పై లిక్విడ్ ఎటాక్

**నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**మాజీ సీఎంకు భద్రత లేదని ఆప్ నేతల ఆగ్రహం**

వారధి, నేషనల్ బ్యూరో:

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై ఓ వ్యక్తి లిక్విడ్‌ను చల్లాడు. పాదయాత్రలో భాగంగా ప్రజల మధ్య నుంచి అభివాదం చేస్తూ కేజ్రీవాల్ నడుస్తుండగా ఈ ఘటన జరిగింది. దీనితో అక్కడ తీవ్రమైన అలజడి ఏర్పడింది.

ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో మాలవీయ నగర్‌లో పాదయాత్ర చేస్తున్న కేజ్రీవాల్‌పై ఒక వ్యక్తి గుర్తు తెలియని ద్రవాన్ని చిమ్మడం కలకలం సృష్టించింది. అయితే వెంటనే అప్రమత్తమైన కేజ్రీవాల్ భద్రతాసిబ్బంది ఆ వ్యక్తిని వెనక్కిలాగేశారు. కోపంతో కేజ్రీవాల్ అభిమానులు అతడిపై దాడిచేశారు. నిందితుడిని కొట్టుకుంటూ కేజ్రీవాల్‌కు దూరంగా తీసుకెళ్లారు. పోలీసులు వెంటనే ఓ తాడుతో కేజ్రీవాల్ చుట్టూ భద్రతావలయంగా ఏర్పడ్డారు. నిందితుడు ఝా (41 ఏళ్లు) ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఖాన్‌పూర్ డిపోలో బస్ మార్షల్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు గుర్తించారు. అతనిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, దాడికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని వారు తెలిపారు

# టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
- **డిసెంబర్ 3తో ముగియనున్న మహేందర్ రెడ్డి పదవీకాలం**

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా బుర్రా వెంకటేశంను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ డిసెంబర్ 3తో మహేందర్‌రెడ్డి పదవీకాలం ముగియనుంది. ఆయన స్థానంలో వెంకటేశం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియామకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇవాళ ఆమోదించారు. డిసెంబర్ 3తో ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ కాలం ముగిసిపోతోంది. అందుకే కొత్త చైర్మన్ నియామకానికి ప్రభుత్వం ఈ మధ్య కాలంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. 20 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 45 అప్లికేషన్లు వచ్చాయి. వారిలో బుర్రా వెంకటేష్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పేరును గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. దానికి ఇవాళ ఆమోదం తెలిపింది.

బుర్రా వెంకటేశం జనగామ జిల్లాలో 1968 ఏప్రిల్ 10న జన్మించారు. గురుకులాల్లో చదివిన ఆయన సివిల్స్ క్రాక్ చేశారు. 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వెంకటేశం... రాజ్ భవన్ సెక్రటరీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పని చేశారు.



## విద్యారంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి శివ వర్మ**

వారధి న్యూస్, కొల్లాపూర్ :

తెలంగాణా రాష్ట్రం లో విద్యా రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి గా విస్మరిస్తున్నదని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి శివ వర్మ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కొల్లాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి శివ వర్మ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పాఠశాలలలో ఫుడ్ పాయిజన్ల విద్యార్థుల ఆత్మహత్యల కలకలం సంచలనం రేపుతున్న ఏ మాత్రం కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇవి విద్యార్థుల హత్యలు కాదు ప్రభుత్వ హత్యలుగా ప్రత్యక్షంగా కనబడుతున్నాయని ఆయన ఆరోపించారు.ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ మరణాలు సంచలనంగా కనబడుతున్న అధికారులు ప్రభుత్వ మంత్రులు ,ముఖ్యమంత్రి ఎవరికి కూడా సోయి లేకుండా కేవలం వారి సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రమే తాపత్రయపడుతున్నారు తప్ప విద్యార్థుల సమస్యలపై ఏమాత్రం కూడా ఎవరు స్పందించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పైన ఆయన మండి పడ్డారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు ఇవ్వడం లేదని, దానిద్వారా కాంట్రాక్టర్లు నాసిరకమైన సరుకులను పాఠశాలలకు అందిస్తూ విద్యార్థుల మరణానికి ప్రత్యక్షంగా కారణమవుతున్నారనీ .కేవలం కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి సంబంధించిన వారు కాంట్రాక్టర్లుగా ఉండడం ప్రభుత్వ అండదండలతో విద్యార్థులను బలి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులని ఏమాత్రం కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరించడం సిగ్గు చేటు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించి విద్యార్థులకు సమస్యలు లేకుండా పరిష్కారం చేయాలని విద్య సంస్థల బంద్ లో ఆయన ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం విద్యా సంస్థల బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివకుమార్ ,కార్తీక్, లోకేష్, భాను, శివ, రాజేష్, సురేష్ ,మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏ ముఖం పెట్టుకొని పాలమూరుకు వచ్చినవ్ రేవంత్ రెడ్డి : సాతర్ల అర్జున్

వారధి న్యూస్, వనపర్తి:

వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితులను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ మాట్లాడుతూ, కళాశాలలో పెండింగ్ సమస్యలు, వసతుల లోపం, విద్యార్థుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.




**పాలమూరు బిడ్డ సీఎం అయితే మార్పు ఎక్కడ?**

సాతర్ల అర్జున్ వ్యాఖ్యానిస్తూ, "మా పాలమూరు బిడ్డ సీఎం అయితే మా జీవితం మారుతుందని ఆశించాం. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం పడితే క్లాసులు జరగలేని పరిస్థితులు, స్కావెంజర్లు, అటెండర్లు లేక కళాశాల మురికిగా మారడం సాధారణమైంది" అని అన్నారు.విద్యార్థుల ఆకలి, ఆత్మహత్యలు పట్ల నిర్లక్ష్యం మాగనూరు గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా అనేక మంది విద్యార్థులు అనారోగ్యం పాలవ్వడం, మదనపురం ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య ఘటనల్లో ప్రభుత్వ చర్యలు విస్మరించారని ఆయన ఆరోపించారు. "తెలంగాణ వ్యాప్తంగా 51 మంది విద్యార్థులు మృతి చెందినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. మీ మంత్రులు నిర్లక్ష్యంగా మాట్లాడడం విద్యార్థులను మరింత నిరాశకు గురిచేస్తోంది" అని సాతర్ల అర్జున్ విమర్శించారు. "రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంది" అని అర్జున్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి "ఏ ముఖం పెట్టుకొని పాలమూరుకు వచ్చినవ్?" అని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశం" అంటూ ఏబీవీపీ తుది హెచ్చరిక చేసింది.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల బాట ఎందుకు పట్టారో చెప్పాలి

- **టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.**

వారధి న్యూస్, కూకట్‌పల్లి :



తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనని చూసి ఓర్వలేక ఏదో ఒక రకంగా దెబ్బతీయాలని బీఆర్ఎస్ నేతలు ఫార్మ్ హౌస్ లో కూర్చుని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కుట్రలకు, అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని శనివారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల కొనుగోలు ఫాం హౌస్ కుట్ర వర్క్ ఔట్ కాలేదని ఇప్పుడు కేసిఆర్ ఫార్మ్ హౌస్ లో కూర్చుని గురుకులాల్లో కొందరితో గులాబీ నేతలు కుమ్మక్కై ఫుడ్ పాయిజన్ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గురుకులాల సెక్రెటరీగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఉన్నప్పుడు అద్దె భవనాలన్నీ ఆయన అనుచరులవే అని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అసలు గురుకులాల బాట ఎందుకు పట్టారో చెప్పాలని డిమాండ్ చేసారు. మీ కుట్రలతో విద్యార్థుల ఉసురు పోసుకోవద్దని ప్రవీణ్ కుమార్ ను హెచ్చరించారు. ప్రవీణ్ కుమార్ ను కేసీఆర్, కేటీఆర్ లు పావుగా వాడుకుంటున్నారని, పెద్ద దొర, చిన్న దొర కుట్రలకు బలి కావద్దని, ప్రభాకర్ రావు విదేశాల్లో తలదాచుకున్నట్లు ప్రవీణ్ కుమార్ ఆ పరిస్థితి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతో మంది విద్యార్థులు చనిపోయారని, కనీసం వారి గురించి వాళ్ళ కుటుంబాల గురించి పట్టించుకోలేదు, కానీ ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ముసలి కన్నీరు కారుస్తున్నారని, గతంలో మెస్ చార్జీలు అద్దెలు చెల్లించని వాళ్ళు ఇప్పుడు రాజకీయం చేస్తున్నారని అన్నారు. అన్ని గురుకులాలు ఒకేచోట ఉండాలని ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రభుత్వం తీసుకొస్తుంటే బీఆర్ఎస్ ఫుడ్ పాయిజన్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. గురుకులాల్లో మేస్ చార్జీలు పెంచాము సౌకర్యాలు పెంచాము పేద వర్గాల పిల్లల భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తెస్తూ వారి అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఘటనల వెనుక ఉన్న కుట్రలను బయటకు తీసి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి


వారధి న్యూస్, ముషీరాబాద్:

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ లు ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే దివ్యాంగుల ఫించన్ 6వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. దివ్యాంగుల పించన్లు పెంచాలని, పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. హామీ ఇచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా అమలు చేయకుండా సంబరాలు చేసుకుంటుందని విమర్శించారు. దివ్యాంగుల పింఛన్ 6వేలకు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని పలుసార్లు మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రాలు సమర్పించినా స్పందించక పోవడం దారుణమన్నారు. దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం స్పందించి ఫించన్ పెంచాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని అన్నారు. లేనట్లయితే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల నాయకులు కిరణ్, వెంకట్రావు, గోపాల్, అందె రాంబాబు, జంగయ్య, యాదగిరి, శివలు పాల్గొని మద్దతు ప్రకటించారు. దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లగచర్లలో మళ్లీ భూసేకరణ

- **ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సర్కారు నిర్ణయం**
- **భూసేకరణ నోటిఫికేషన్ విడుదల**
- **లగచర్లలో 110.2, పోలేపల్లిలో 71.9 ఎకరాల సేకరణ**

వారధి, స్టేట్ బ్యూరో:



లగచర్ల ప్రజల ఆందోళన నేపథ్యంలో ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని లగచర్ల, పోలేపల్లిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో 110.2 ఎకరాలు, పోలేపల్లిలో 71.9 ఎకరాల్లో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణకు ప్రణాళిక సిద్ధం చేసింది.
అయితే ఇక్కడ టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. కాలుష్య రహిత కంపెనీల ఏర్పాటుతో స్థానికంగా ఉన్న గ్రామస్థులు, యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. అయితే, ఇప్పటికే ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామస్థులు ఇండస్ట్రియల్ కారిడార్ అంగీకరిస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.




## విద్యాశాఖ పవిత్రమైంది

వారధి న్యూస్, వనపర్తి :

అన్ని శాఖల్లోకెల్ల విద్య,వైద్య శాఖలు అత్యంత పవిత్రమైనవని జిల్లా విద్యాశాఖాధికారి మహ్మద్ అబ్దుల్ గని అన్నారు.బదిలీపై వెళ్లిన మాజీ డిఇఓ డా.గోవిందరాజుకు శుక్రవారం (సాయంత్రం)ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అబ్దుల్ గని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో ఎక్కువగా పేదవిద్యార్థులే చదువుకుంటున్నారని వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతోంది కాబట్టి ఈ శాఖలోని ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని ఆయన కోరారు.అలాంటి వారిని ప్రజలు అధికారులు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని పేర్కొన్నారు. గత డిఇఓ గోవిందరాజు విధి నిర్వహణలో అలుపెరుగని వారని అందరినీ కలుపుకుపోయే తత్వమని ఈ మధ్య జరిగిన పదోన్నతులు,బదిలీలను ఎంతో పారదర్శకంగా నిర్వహించారని,ఆయన ఈ జిల్లాకు చేసిన సేవలను ఇక్కడి వారు ఎప్పటికీ మరచిపోరని కొనియాడారు.మాజీ డిఇఓ గోవిందరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారులు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శిరసా వహించి చేశానని అందుకు ఉపాధ్యాయులు వివిధ సంఘాల నాయకులు తనకు ఎంతో తోడ్పాటును అందించారని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా విద్యాశాఖతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గోవిందరాజును ఘనంగా సన్మానించారు.ఈనాటి కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ సూర చంద్ర శేఖర్, ఎసిజిఇ గణేష్ కుమార్,ఎంఈఓ లు మద్దిలేటి,శ్రీనివాస్ గౌడ్,విష్ణు,శ్రీనివాసులు,ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్,ఉమాదేవి,సరస్వతి,శంకరయ్య,నరసింహారెడ్డి,ఉపాధ్యాయ సంఘ నాయకులు శ్రీనివాసరావు,హరిప్రసాద్,మహిపాల్ రెడ్డి,కృష్ణయ్య,రవిప్రసాద్ గౌడ్,వరప్రసాద్ గౌడ్,ఆర్. శ్రీనివాసులు దాదాపు డెబ్బై మందికి పైగా ఉపాధ్యాయులు,సామాజిక కార్యకర్త గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

- **ఫుడ్ పాయిజన్స్ తో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం.**
- **ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి.**
- **ఘటనకు కారణమైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి.**
- **వామ పక్ష విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో విద్యాసంస్థలు బంద్ విజయవంతం.**

వారధి న్యూస్, వనపర్తి:

రాష్ట్రంలో రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫాయిజాన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, పి డి ఎస్ యు నాయకులు గణేష్ వెంకటేష్ మండిపడ్డారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బందులో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బందు చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పై ముఖ్యమంత్రి రివ్యూ చేసి ఈ తరహా ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ తో ఇప్పటికీ నలుగురు విద్యార్థులు మృతి చెందగా,920 మంది ఫుడ్ పాయిజన్ తో ఆస్పత్రి పాలైనరన్నారు. రాష్ట్రంలో నాసిరకం బియ్యం నిత్యవసర వస్తువులు అందించకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని,పెరిగిన ధరలను అమలు చేస్తూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న నాయక్, నీలోత్పల్ ,భరత్ , మోహన్, శ్రీకాంత్, కార్తీక్, హరీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, పి డి ఎస్ యు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం

వారధి న్యూస్, పెబ్బేరు:

పెబ్బేరు లో శ్రీ శ్రీ శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. పెబ్బేరు పట్టణానికి చెందిన సేవకుల మధుస్వామి అయ్యప్ప మాల ధారణ ధరించి 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం నారికేళ గురు స్వామి గా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. గణపతి పూజ తొ ప్రారంభించి అయ్యప్ప స్వామి అభిషేకం, మెట్లపూజ, హారతి అనతరం అయ్యప్ప స్వామి మాలదరించిన మధు స్వామి నారికేళ జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దీక్ష మాలధారణ స్వాములు పాల్గొని పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, మహిళలు, పట్టణములో ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





# పదవీ విరమణ పొందిన ఏఎస్సై బీచుపల్లిని సన్మానించిన అదనపు ఎస్పీ వీరారెడ్డి

వారధి న్యూస్, వనపర్తి:

36 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందించిన వనపర్తి జిల్లా ఆత్మకూరు ఏఎస్సై బీచుపల్లి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వీరారెడ్డి ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, పదవీ విరమణ జీవితం ఒక కొత్త అధ్యాయం ప్రారంభమని, కుటుంబంతో సంతోషంగా గడపాలని సూచించారు. ఖాళీగా ఉండటం నిరుత్సాహానికి దారితీస్తుందని, కొత్త వ్యాపకాల్లో పాల్గొనడం లేదా నచ్చిన రంగంలో ముందుకు సాగడం ద్వారా ఉత్తమమైన జీవనాన్ని మలచుకోవచ్చన్నారు.

తమకంటూ వచ్చిన సొమ్మును జాగ్రత్తగా, ప్రణాళికతో వినియోగించుకోవాలని, ఇది భవిష్యత్తులో ఆర్థిక సురక్షకు దోహదం చేస్తుందని తెలిపారు. ప్రజల కోసం న్యాయపరమైన సహాయం అందించడంలో పోలీస్ ఉద్యోగం గొప్ప అవకాశం ఇస్తుందని, ఈ పదవిలో ఉన్నతమైన సేవలందించడం గర్వకారణమని అన్నారు.అదనపు ఎస్పీ వీరారెడ్డి, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకు ప్రభుత్వం అందించే అన్ని బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూసేందుకు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ఆత్మకూరు ఎస్సై నరేందర్, సూపరింటెండెంట్లు సయ్యద్ ఇంతియాజ్, రాజవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ వినోద్, ఎస్పీ సీసీ మధు, పదవీ విరమణ పొందిన ఏఎస్సై బీచుపల్లి కుటుంబ సభ్యులు, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.





# సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

వారధి న్యూస్, వనపర్తి :

వనపర్తి పట్టణంలో 30 వ వార్డు లోని జంగిడిపురం బ్లాసమ్స్ ప్లే వే స్కూల్ నందు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను మున్సిపల్ వైస్ చైర్మన్ 30 వ వార్డ్ కౌన్సిలర్ వాకిటి శ్రీధర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ పిల్లల లో ఉన్న సృజనాత్మక శక్తి నీ వెలికి తీయడానికి ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్ లు ఉపయోగ పడతాయని నేటి బాల బాలికలు రేపటి భారతదేశ శస్త్రవేత్తలు గా ఎదుగుతారని అలాంటి స్ఫూర్తి తో విద్యార్థులు ముందుకు వెళ్లాలని కొనియాడారు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగ స్టాల్స్ నూతన ప్రయత్నాలు చూపరులను ఆకట్టుకున్నాయి విద్యార్థులను మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అభినందించారు కార్యక్రమంలో కౌన్సిలర్ రహీమ్ ఉన్నీస బేగం అనురాధ సుధాకర్ అధ్యాపకులు తల్లి తండ్రులు ఉపాధ్యని ఉపాధ్యాయులు పోల్గొన్నారు






# విధుల యందు, క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరు బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజ్ గౌడ్

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

వారధి న్యూస్ మెదక్ జిల్లా బ్యూరో

విధుల యందు క్రమశిక్షణ అంకిత భావానికి మారుపేరుగా బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజు గౌడు అని జిల్లా కలెక్టర్ కొనియాడారు శుక్రవారం మెదక్ పట్టణం మాయ గార్డెన్ లో బీసీ సంక్షేమ అధికారిగా మెదక్ జిల్లాలో పనిచేసే నేడు పదవీ విరమణ పొందుతున్న నాగరాజ్ గౌడ్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్ ప్రభుత్వ ఉద్యోగంలో చేరి అంచలంచలుగా ఎదుగుతూ తన విధి నిర్వహణతో పాటు బీసీ సంక్షేమ శాఖను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవిరాల కృషి చేశారని కొని ఆడారు. అధికారులు బదిలీపై వస్తూ ఉంటారు, వెళ్తూ ఉంటారు కొందరు మాత్రమే విధుల యందు క్రమశిక్షణ అంకితభావంతో పనిచేస్తారని, వారిలో బీసీ సంక్షేమ శాఖ అధికారిగా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి నేడు పదవి విరమణ పొందుతున్న నాగరాజుగౌడ్ ఉంటారని ప్రశంసించారు. పదవీ విరమణ శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపాలని ఆకాంక్షించారు. అంతకుముందు కలెక్టర్ శాలువాలు మెమొంటోలు పూల బొకేలతో బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్ ను ఘనంగా సత్కరించారుపదవీ విరమణ పొందుతున్న నాగరాజుగౌడ్ గారికి టీఎన్జీవోస్, కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై శాలువాలు పూల బొకేలతో ఘనంగా సత్కరించారు ఈ పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జాముల నాయక్ , మత్స్య శాఖ అధికారి,టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, సంబంధిత బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులకు తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి

వారధి న్యూస్, వనపర్తి:

తెలంగాణ రాష్ట్రంలో బిల్డింగ్ వర్కర్లు, బీడీ కార్మికులు వంటి పేద కార్మిక వర్గాలకు తొలివిడతలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు.

శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నిక్సన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి విడతగా వికలాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేని వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించనున్నట్లు అధికారులకు సూచించిన విషయం గుర్తుచేశారు. అయితే, పేదరికంలో జీవిస్తున్న బిల్డింగ్ కార్మికులు, బీడీ కార్మికుల పరిస్థితిని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

సొంత స్థలాలు లేని కార్మికులకు స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్నారు. ప్రత్యేకంగా బీడీ కార్మికులు ప్రతినిత్య జీవనోపాధి కోసం అనారోగ్యకరమైన పరిస్థితుల్లో పని చేస్తుండటం వల్ల వారు మరింత దృష్టి తగిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, గంధం మదన్, నంది మల్ల రాములు, బాలస్వామి, రాములు, కే వెంకటన్న తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

వారధి న్యూస్, వనపర్తి :

డిసెంబర్ 22వ తేదీన నిర్వహించనున్న వనపర్తి డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల కమిటీ సమీక్షా సమావేశం నేడు వనపర్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రామనాదం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గతంలో వేసిన సావనీర్ కమిటీ, కల్చరల్ కమిటీలతోపాటు కోఆర్డినేషన్ కమిటీ,ఫైనాన్స్ కమిటీ, మహిళా కమిటీ, ఆహ్వాన కమిటీలతో పాటు మొత్తం 8 కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ అన్ని కమిటీలు స్వర్ణోత్సవాలను విజయవంతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేస్తాయని వనపర్తి డిగ్రీ కళాశాల అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు ఆర్యభవన్ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1974లో ఆర్.ఎల్.డి కళాశాలగా ప్రారంభమైన నాటినుండి నేటి వరకు కళాశాలలో చదివిన అందరూ విద్యార్థులు తప్పనిసరిగా హాజరై స్వర్ణోత్సవాలనువిజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఎన్నికల ముందు గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

- జిఎంపిఎస్ మండల అధ్యక్షులు ఊడుగుల ఐలయ్య యాదవ్

వారధి న్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి:

గొల్ల కురుమలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షులు ఊడుగుల ఐలయ్య అన్నారు. శనివారం జిఎంపిఎస్ దంతాలపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తాహశీల్దారు కార్యాలయంలో తాహశీల్దార్ చంద్ర రాజేశ్వర రావు కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐలయ్య మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేస్తుందని, ఎన్నికల ముందు బిసి డిక్లరేషన్ లో గొల్ల కురుమలకు గత ప్రభుత్వం గొర్రెలను ఇస్తానని, గొల్ల కురుమలను మోసం చేసిందని వాటికి బదులుగా రెండు లక్షల రూపాయల తో గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. హామీ ఇచ్చి కూడా సంవత్సరం గడుస్తున్నప్పటికీ గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఎలాంటి ముందుచూపుగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెలకు నట్టల మందులు, వెటర్నరీ హాస్పటల్లకు సరిగా మందులు సరఫరా చేయడం లేదని,దానివల్ల ప్రైవేట్ వైద్యం మీద గొల్ల కురుమల ఆధారపడాల్సిన అవసరం వచ్చిందని, దానివల్ల గొల్ల కురుమలు వేలాది రూపాయలు నష్టపోతున్నారని వారు అన్నారు. 50 సంవత్సరాలు నిండిన గొల్ల కురుమలకు ఐదువేల రూపాయల పింఛన్ ఇవ్వాలని, రాష్ట్రంలో ఉన్న అన్ని గొర్రెలకు మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువైందని వాటిని ప్రభుత్వం నివారించాలని, కుక్కల దాడిలో చనిపోయిన గొర్రె కాపరుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, అన్నారు .ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని లేనియెడల గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బోర మల్లయ్య, నాయకులు కొండ వెంకన్న యాదవ్ , గుండాల భూపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎం.ఆర్. సునిత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్

వారధి న్యూస్, వనపర్తి :

వనపర్తి జిల్లా కేంద్రంలోని కోర్టు వద్ద ఉన్న న్యాయసే వాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కల్పిస్తున్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.ఆర్. సునిత, కార్యదర్శి వి.రజని అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ప్యానల్ న్యాయవాదులు పారాలీగల్ వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవల విభాగాలను జిల్లాలో విస్తృతంగా ఏర్పాటుచేసి పిల్లలకు చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు లోక్ ఆదాలత్ సంస్థ ప్రతేక చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాలలో పారాలీగల్ వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి వీటి ద్వారా అర్హులైన ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టాము అన్నారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు నివారణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలలో అవగాహన కల్పించి లైంగిక వేధింపులను దూరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు బి. శ్రీలత వై. జానకి డిఫెన్స్ కౌన్సిల్ జి. ఉత్తరయ్య న్యాయవాదులు కే.మోహన్ కుమార్, దేగల కృష్ణయ్య, కళ్యాణి, రాజు, కరుణాకర్ పారాలీగల్ వాలంటీర్స్ ఎం.డి. మహ్మద్, కావలి అరుణ కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల వాసి జమున కు డాక్టరెట్

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి

జగిత్యాల పట్టణానికి చెందిన బొద్దున జమున పీ.హెచ్.డీ పట్టాను అందుకొన్నారు. గణితంలో పి.హెచ్.డి లో భాగంగా బయో కన్వెర్షన్ ఇన్ పోరస్ స్క్వేర్ క్యావిటీ కంటైన్ గ్రయో టాపిక్ మైక్రో ఆర్గనైజిమ్ ఆండ్ నానో ఫ్లూయడ్ అనే అంశంలో పరిశోధనలను పూర్తి చేశారు. కే.ఎల్ యూనివర్సిటీ పూర్తి చేసిన తీసిస్ తో శనివారం మాజీ రాష్ట్ర పతి రామ్ నాథ్ కోవిధ్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసోసియేట్ వైస్ ఛాన్సలర్ జి.పార్థసారథి చేతుల మీదుగా విజయవాడ లో డాక్టరెట్ పట్టాను అందుకొన్నారు. జమున డాక్టరెట్ పట్టాను అందుకొన్న సందర్బంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## ఉమామహేశ్వర దేవస్థానానికి రూ.25.లక్షలు విరాళం

వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో:

శ్రీశైలం ఉత్తర ద్వారంగా పేరుగాంచిన మండల పరిధిలోని ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధికి, నిత్య అన్నదానానికి అచ్చంపేట రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, సంఘం నాయకులు 25 లక్షలు విరాళం ఇచ్చారు. సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డికి శనివారం.ఇచ్చారు. క్రి.శే. మర్యాద గోపాలరెడ్డి ఉమామహేశ్వర క్షేత్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారి స్ఫూర్తితో రెడ్డి సంఘం తరుపున ఆలయ అభివృద్ధికి తమవంతు పాత్ర విరాళం ఇచ్చినట్లు తెలిపారు దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమం లో రెడ్డి సేవా సంఘం భాగస్వామ్యం ఉంటుందని రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి తెలియచేశారు. ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో రెడ్డి సేవ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు హోమం చేశారు. విరాళం ఇచ్చిన రెడ్డి సేవా సంఘం నాయకులను ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో. రెడ్డి సేవా సంఘం నాయకులు రామకృష్ణ రెడ్డి, డా. గోవర్ధన్ రెడ్డి , ఆడపాల గోపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి ,కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి ,జైపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ చంద్రా రెడ్డి, ఉన్నారు.



## పాలకుల నిర్లక్ష్యంతో బ్రష్టు పడుతున్న విద్యా, వైద్య వ్యవస్థలు

- బిజెపి మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణ గౌడ్

వారధి న్యూస్, కొల్లాపూర్ :

కొల్లాపూర్ నియోజక వర్గంలో పాలకుల నిర్లక్ష్యంతో విద్యా వైద్య వ్యవస్థలు భ్రష్టపడుతున్నాయని బిజెపి మండల అధ్యక్షుడు తమటం సాయి కృష్ణ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. శనివారం పాలకుల తీరుకు నిరసనగా బిజెపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలియజేస్తూ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణ గౌడ్ మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ గర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సంబరాలకు విచ్చేయుచున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు కాంగ్రెస్ కార్యకర్తలు తరలి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు అన్నిటిని కాంగ్రెస్ నాయకులే తీసుకెళ్లడంతో కొల్లాపూర్ ప్రయాణికులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వేలమంది ప్రయాణికులు విద్యార్థులు తిరిగే ఆర్టీసీ బస్సులను అధికార పార్టీ నాయకులు ముఖ్యమంత్రి సభ కోసం వాడుకోవడం దురదృష్టకర మన్నారు దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా రైతులు కూలీలు పనులకు వెళ్లకుండా ప్రయాణికులు పనులు మానేసే పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ మాత శిశు సంరక్షక ఆసుపత్రిలో కేవలం మంగళవారం బుధవారం మాత్రమే గర్భిణులకు వైద్య సేవలు అందించడం పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు గర్భిణులకు వైద్య సేవలు అందించడంతో పాటు కాన్పుల కోసం వచ్చే వారికి వైద్యులు అందుబాటులో ఉండాలని ఆ దిశగా మంత్రి జూపల్లి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవ లేక మహబూబ్ న గర్ నాగర్ కర్నూల్, హైదరాబాద్ కు రోగులను తరలిస్తున్నారని విద్యా వైద్య రంగాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సందు రమేష్, కేతూరి నారాయణ ,కాశిపురం మహేష్ ,పరమేష్, భాస్కర్, లావణ్య, భరత్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు సిబ్బంది కి శిక్షణ



వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

జ్యుడీషియల్ అకాడమీ ఆదేశానుసారం జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో కోర్టు సిబ్బందికి 57 మందికి ఈ సిటీ 11 2024 సామర్థ్య పెంపుపై ఈ ఫైలింగ్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ డి రాజేష్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఈ ఫైలింగ్ అవగాహన కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ఉపయోగపడతాయి కంప్యూటర్ స్కిల్స్ వల్ల మనం ఎక్కడ ఉన్నా మొబైల్ ఫోన్ ద్వారా కోర్టులో జరిగే కేసు విచారణ వాయిదాలు కోర్టు ప్రొసీడింగ్స్ అన్ని మనం సులభతరంగా తెలుసుకోవచ్చు న్యాయవాదులు వారి ఆఫీసు నుంచే ఈ ఫైలింగ్ చేసుకొని సదుపాయం కల్పించబడింది భవిష్యత్తులో పేపర్ లెస్ కోర్టుగా మార్చాలని ఈరోజును హిస్టారిక్ డే గా ఈ ఫైలింగ్ సిస్టం ఎక్స్పర్ట్ గా కావాలి 3.0 నుంచి 4.0 గా అప్డేట్ చేయబడింది ఈ ట్రైనింగ్ వల్ల హిస్టారిక్ మూమెంట్ మంచి ఫౌండేషన్ నాగర్ కర్నూల్ జిల్లా జ్యుడీషియల్ డిస్ట్రిక్ట్ గా రాష్ట్రంలోనే మంచి పేరు తీసుకురావాలని ఆయన తెలిపారు. మన జిల్లా మన జిల్లా పరిధిలోని కల్వకుర్తి అచ్చంపేట కొల్లాపూర్ నాగర్ కర్నూల్ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలను కోర్టు ప్రాంగణంలోనే ప్రారంభించడం జరిగింది. ఎలాంటి కక్షిదారులకు కేసు విషయం గురించి తెలుసుకోవచ్చు ప్రెస్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ప్రతినిధులు ఇలాంటి ప్రోగ్రామ్ ను కక్షిదారులకు చేరవేసే విధంగా కృషి చేయాలి అన్నారు ప్రెస్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ సివిల్ శ్రీమతి జి సబిత ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్, మౌనిక న్యాయశాఖ ఉద్యోగులు పత్రిక సోదరులు పాల్గొన్నారు.





## ఫుడ్ పాయిజన్ కు కారణమైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి ఎస్ ఎఫ్ ఐ

వారధి న్యూస్, పెబ్బేరు:

రాష్ట్రంలో రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాలలో ఫుడ్ ఫాయిజన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ పెబ్బేరు మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, ఆంజనేయులు మండిపడ్డారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బందులో భాగంగా పెబ్బేరు మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బందు చేసి నిరసన వ్యక్తం చేశారు.
సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పై ప్రభుత్వం విచారణ చేసి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ తో ఇప్పటికీ నలుగురు విద్యార్థులు మృతి చెందగా, 920 మంది ఫుడ్ పాయిజన్ తో ఆస్పత్రి పాలైనరన్నారని తెలిపారు. రాష్ట్రంలో నాసిరకం బియ్యం నిత్యవసర వస్తువులు అందించకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ,శేఖర్ సూరి, అజయ్, శివ, గణేష్, బాలు, అంజి తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించిన మంచిర్యాల ఏసిపి ప్రకాష్....

వారధి న్యూస్,గోదావరిఖని :

మంచిర్యాల జిల్లా ఎసిపి ప్రకాష్ ని, శనివారం మర్యాద పూర్వకంగా కలిసి బోకే అందించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది, భారత రాజ్యాంగం తెలుగు పుస్తకాన్ని ఏసిపి ప్రకాష్ ఆవిష్కరించడం జరిగింది.గోదావరిఖనిలో డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ జ్ఞానమాల ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దపల్లి, (గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ) బొంకూరి మధు, ఏఐ,ఏవైఎస్ జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ , సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్ఆర్పి 3 అసిస్టెంట్ సెక్రటరీ నెరువట్ల,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## రైతు సంబరాలకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

వారధి న్యూస్, కొల్లాపూర్ :

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిర్వహించిన రైతు సంబరాలకు కొల్లాపూర్ నియోజక వర్గం నుండి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు నాయకులు పాలమూరు రైతు సంబరాలకు శనివారం తరలి వెళ్లారు. కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామ గ్రామం నుండి ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల్లో ప్రైవేటు వాహనాల్లో రైతులు కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన పాలమూరు సంబరాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ.... గడచిన పది సంవత్సరాల బి.ఆర్.ఎస్ పరిపాలనలో రైతు రుణమాఫీ చేయలేదని, రైతులను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలనలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయలను ఏకకాలంలో రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. తామంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామని రైతులు ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నారు



## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు.
మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రావు పదవీ విరమణ సందర్భంగా శనివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని వేలమ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...
జిల్లా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ అధికారిగా శ్రీధర్ రావు తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశా రని, అధికారులు, డిఈలు,ఎఈలు సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు.
జిల్లాలో ప్రభుత్వం విధించిన విధి విధానాల ప్రకారం మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో ఇంటింటికి సరఫరా చేసే తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు, పరిష్కరిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించరని కలెక్టర్ తెలిపారు.
ఎప్పుడు పిలిచిన వెంటనే స్పందిస్తూ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ఇంటికి పంపిణీ చేసే త్రాగునీటి సరఫరాలో తలెత్తి సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని,ఈఈ శ్రీధర్ రావు సేవలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించారు.
అదనపు కలెక్టర్ కే సీతారామారావు మాట్లాడుతూ....
ఉద్యోగ జీవితంలో 34 సంవత్సరాల నుండి అంకితభావంతో వివిధ హోదాలలో పనిచేశారని, ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.
అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జిల్లా అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ జీవి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్ రావు, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ లు ఈఈ శ్రీధర్ రావును ఘనంగా సన్మానించారు.
వివిధ శాఖల అధికారులు, మిషన్ భగీరథ డిఈలు, ఎఈలు,సిబ్బంది, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక హక్కుల సాధనకై ఉద్యమాలను కొనసాగించాలి...

వారధి న్యూస్,గోదావరిఖని :

భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు కాగజ్ నగర్ నూతన ఏరియా కమిటీ ఎన్నిక సభ అధ్యక్షులు ఎం సంతోష్ వహించారు. నూతన కమిటీ అధ్యక్షులు ఎం.సంతోష్, ఉపాధ్యక్షులు పార్వతి.విలాస్, ప్రధాన కార్యదర్శి ఎం.డి.అన్వర్, సహాయ కార్యదర్శి కాజా, కోశాధికారి పుప్పాల.లక్ష్మీనారాయణ సభ్యులు చంద్రన్న, నాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు బి.భాస్కర్ మాట్లాడుతూ..కార్మిక హక్కుల సాధనకై ఉద్యమాలను కొనసాగించాలని సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక హక్కులకై నిరంతరం పోరాటాలను నిర్వహించినప్పుడే హక్కుల సాధించబడతాయని తెలియజేశారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.క్రిష్ణ మాట్లాడుతూ... దేశంలో బి.జె.పి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసి, (4) నాలుగు లేబర్ కోడ్ గా మార్చిన నరేంద్రమోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పోరాటాలను మరింత ఉదృతం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె విశ్వనాథ్ మాట్లాడుతూ... నేడు మరికొన్ని రంగాల్లో అనివార్యంగా తప్పనిసరి పరిస్థితుల్లో శ్రమ దోపిడికి గురవుతున్నారు. వివిధ రంగాల షాపులలో ఇలా అనేకమైన పని ప్రదేశాల్లో కుటుంబ భారాన్ని వెలదీయడం కోసం పని గంటల భారాన్ని కూడా మౌనంగా భరిస్తూ జీవిస్తున్నారు. వీరి కోసం ప్రత్యేకమైనటువంటి సమగ్ర చట్టం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్ భీమన్న మాట్లాడుతూ కార్మికవర్గంపై చట్టం అనే పేరుతో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు అవసరం అన్నారు.ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు అప్పన్నంగా అమ్మేస్తు అదేకాకుండా రైతాంగం పండిస్తున్న అన్నిరకాల వంటలకు సరైన మద్దతు ధరలను కల్పించకుండా, రైతుల ఆదాయన్ని పెంచకుండా, మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయకుండా వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వరంగ పరిశ్రమలైన సింగరేణి, ఆర్టీసీ, జెన్కో, రైల్వే, విద్యుత్ , బ్యాంకింగ్, విమానయానం, రక్షణ విభాగం ఎల్ఐసి వంటి తదతర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పి, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షక వర్గ ప్రజలు పోరాడాలి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, పిడిఎస్యు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు కె.అఖిల, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు కె. శశికళ తదితర కార్మికులు పాల్గొన్నారు.




## రైతు పండుగ సదస్సుకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

వారధి న్యూస్_ ఆత్మకూరు.,

ఆత్మకూరు ,అమరచింత పట్టణ మండల కేంద్రాలలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహబూబ్నగర్ జిల్లా అమిస్తాపూర్ లో జరుగును రైతు పండుగ సదస్సు కు కాంగ్రెస్ పార్టీ నాయకులు బయలుదేరడం జరిగింది. ఆత్మకూరు పట్టణంలో మండల అధ్యక్షులు పరమేశ్, పట్టణ అధ్యక్షులు నలగొండ శ్రీనివాసులు ,మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బయలుదేరారు.

అమరచింతలో.. అమరచింత పట్టణ ,మండల పరిధిలోని గ్రామాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతు పండుగ సదస్సు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గీత సంఘం చైర్మన్ గౌడ సంఘం చైర్మన్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు




## ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

- విద్యార్థి సంఘ నాయకులు.

వారధి న్యూస్_ ఆత్మకూరు

ఆత్మకూరు అమర చింత పట్టణ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు శనివారం బంద్ విజయవంతమైనట్లు విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ పిడిఎఫ్ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి విద్యార్థులకు ఆత్మసత్యత గురవుతున్నది కావున వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవ పిడిఎఫ్ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

## నేటి నుండి అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో నూతనంగా డిగ్రీ అడ్మిషన్ లు పొందిన మరియు సెకండ్ ఇయర్ ,థర్డ్ ఇయర్ వారికి డిసెంబర్ 1 (ఆదివారం) నుండి తరగతులు ప్రారంభించనున్నట్టు నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్పల్ M.అంజయ్య తెలిపారు. 1,3,5 వ సెమిస్టర్ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కళాశాలలో జరిగే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరగతులు కేవలం ఆదివారం మాత్రమే నిర్వహించబడునని తెలిపారు. మరింత సమాచారం కోసం 7382929779 నంబర్ ను లేదా కళాశాలలో సంప్రదించాలన్నారు.



## కొనసాగుతున్న వరి కొనుగోలు

వారధి న్యూస్_ఆత్మకూర్.,

ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వారి కొనుగోలు కొనసాగుతున్నది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్యాలయ కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇట్టి వరి కొనుగోలు మార్కెట్ ను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. శనివారం వాతావరణం లో మబ్బులు ఏర్పడడంతో రైతులు వరి ధ్యానంపై ఆందోళన వ్యక్తపరిచారు ,అయినప్పటికీ ఇలాంటి వర్షం రాలేదు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయ సిబ్బంది, దడవాయి సవరన్న, ఆనంద్, రఘు రాములు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





## ప్రయాణికుల సురక్షిత,భద్రత కోసం "మై ఆటో ఇస్ సేఫ్" (MY AUTO IS SAFE)

- ఆటోలో సురక్షితంగా ప్రయణిస్తున్నామనే నమ్మకం కలిగించాలి..
- జగిత్యాల పట్టణంలోని ఆటోలకి క్యూఆర్ (QR) కోడ్ తో అనుసంధానం..
- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పరిమితి లోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలి..
- జిల్లా ఎస్.పి అశోక్ కుమార్

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి






ప్రయాణికుల సురక్షిత,భద్రత కోసం మై ఆటో ఇస్ సేఫ్ (MY AUTO IS SAFE) ని ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందని, జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ తెలిపారు. శనివారం జగిత్యాల పట్టణంలో దాదాపు 1500 ఆటోలకు ఆటో ముందు, వెనక, డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా స్టిక్కరింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా లోని ఆటో రిక్షాల సర్వీసెస్ వాహన యాజమాన్యం నుండి అవసరమైన డాక్యుమెంట్లు ,సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారాన్ని MY AUTO IS SAFE అప్ లో క్యూఆర్ కోడ్ ను జిల్లా పోలీస్ గ్రౌండ్ లో ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

**జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆటోకు స్టిక్కరింగ్ ..**

రాబోవు కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఆటోకు కూడా ఈ స్టిక్కరింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆటోకు "MY AUTO IS SAFE" అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలని అన్నారు.


**ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు సమస్యలు ఏదురైతే ఫిర్యాదుకు అవకాశం..**

ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన, దురుసుగా మాట్లాడిన,ఇతర సమస్యలు ఎదుర్కొన్న మీరు ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల QR కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుందని, వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుందని వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందవేయడంతో వెంటనే స్పందించి వాహనం యొక్క లైవ్ లొకేషన్ కి చేరుకుంటారని అన్నారు.

ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన,ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,హిట్ అండ్ రన్ చేసిన ఈ అప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణ లో భాగస్వామ్యం కావాలి.**

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని అన్నారు.ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పరిమితి మించి ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని అన్నారు.మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడితే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చెస్తామని అన్నారు. అనంతరం "MY AUTO IS SAFE" స్టిక్కరింగ్ పోస్టర్ ను రిలీజ్ చేస్తూ, ఆటో డ్రైవర్లకు అందించడం జరిగింది.ఎస్పీ స్వయంగా ఆటోలో కూర్చొని QR కోడ్ ను స్కాన్ చేసిన అనంతరం వివరాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రఘు చందర్,ఆర్.టి.ఓ శ్రీనివాస్,టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్,రూరల్ సీఐ కృష్ణ రెడ్డి,క్యూ ఆర్ కోడ్ అప్ రూపకర్త రమేష్ రెడ్డి ,ఆర్.ఐ వేణు,ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేశం, పోలీస్ సిబ్బంది,ఆటో డ్రైవర్లు,వాహనాల యజమానులు తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి...

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

వారధి న్యూస్ మెదక్ జిల్లా బ్యూరో

విద్యార్థులు చిన్నప్పటినుండి సైన్స్ పై దృష్టి కేంద్రీకరించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. మెదక్ పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇన్స్పైర్ మరియు వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరుణంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందని దాని మూలంగా రకరకాల అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని వాటిని అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిందిగా ఆయన సూచించారు. అంతేకాకుండా ప్లాస్టిక్ తానే ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని అన్నారు. ఈ మధ్యకాలంలో వాయు కాలుష్యం సైతం విపరీతంగా పెరుగుతుందని దీంతో ప్రజలు రోగాల బారిన ఆకాశం ఉంటుందని వీటిని నివారణపై సైతం దృష్టి కేంద్రకరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఏదేమైనా ఇన్స్పైర్ కార్యక్రమం వల్ల విద్యార్థులకు సైన్స్ పరంగా ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను ఆయన అభినందించారు.

ముగింపు కార్యక్రమంలో గౌరవ మెదక్ జిల్లా విద్యాధి కారి అధికారి , ప్రొఫెసర్ రాధాకిషన్ రావు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

AMO సుదర్శన్ మూర్తి, పరీక్షల విభాగం. ఆఫీసర్ రామేశ్వర్ ప్రసాద్, ఎంఈఓ నీలకంఠం జిల్లాలోని మండల విద్యాధికారులు ,నోడల్ ఆఫీసర్లు, మరియు అన్ని ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు 16 కమిటీల సభ్యులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు మరియు గైడ్ టీచర్లు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు














విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





# రైతు పండుగ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి వీక్షించిన కలెక్టర్

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గత మూడు రోజులుగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండుగ వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించిన ప్రసంగించిన సదరు కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ద్వారా నాగర్ కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామ రైతు వేదికలో గ్రామానికి చెందిన పలువురు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వీక్షించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులు అధికారుల ప్రసంగాన్ని రైతు వేదికలో రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనేక సదుపాయాలను కల్పించడంతోపాటు రైతు రుణమాఫీ, పంట నష్టపరిహారాలు, సన్న రకం వడ్లకు ప్రతి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందజేయడంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలోని రైతంగానికి ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది రైతులు అధిక సంఖ్యలో నేరుగా రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి 250 బస్సుల్లో బయలుదేరి వెళ్లి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్వహించే రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంటల ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గత మూడు రోజులుగా జిల్లా నుండి అనేక మంది రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను, సందేహాలను శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నేటి రైతు పండుగ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని రైతువేదికల్లో ఏర్పాటు చేసి రైతులతో కలిసి ఆయా మండలాల అధికారులు వ్యవసాయ అధికారులు పాల్గొని వీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.





# నీతి నిజాయితీలతో విధులను నిర్వర్తించాలి...

- నూతన కానిస్టేబుల్ లకు దిశానిర్దేశం....
- పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్.....

వారధి న్యూస్, గోదావరిఖని :

పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, పోలీసింగ్ ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలని, వృత్తిపరమైన జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సూచించారు.రామగుండము పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ..రామగుండము పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుండి పోలీస్ శాఖకు ఎంపికైన 392 మంది, ఇందులో 236 మంది సివిల్ కానిస్టేబుళ్లు, అందులో 83 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు, 156 మంది ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లు, అందులో 37 మంది ఆర్మ్‌డ్ మహిళా కానిస్టేబుళ్లు, వివిద పోలీస్ శిక్షణ కేంద్రాలకు శిక్షణకు వెళ్ళి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని శనివారం కమీషనరేట్ కు రావడం జరిగిందని, ఈ రోజు నుండి కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే అనేక సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని,అంకిత భావంతో సేవలుందిస్త వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉన్నదని, చట్టబద్ధమైన పౌరులుగా మీ సేవలను చూసి సమాజం గౌరవించేలా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ ,నిబద్దత తో పనిచేసి పోలీస్ వ్యవస్థకు కృషి చేయాలని, కమీషనరేట్ కు, తెలంగాణ పోలీస్ కు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎ ఆర్ ఏసీపీ సుందర్ రావు, ఎఓ అశోక్ కుమార్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, శ్రీనివాస్, సూపరింటెంట్ల ఇంద్ర సేనా రెడ్డి, మనోజ్ కుమార్,సంధ్య, ఇన్స్పెక్టర్ లు, ఆర్ ఎస్ ఐ లు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తం...

- పేద పిల్లల ప్రాణాలకు రక్షణ లేదు..
- జెడ్పి మాజీ చైర్ పర్సన్ వసంత
- అల్లీపూర్ బిసి గురుకుల పాఠశాల ముందు నిరసన..

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎస్సీ. ఎస్టీ. బీసీ. మైనార్టీ గురుకుల పాఠశాలలో సదుపాయాలు అస్తవ్యస్తంగా మారాయని జగిత్యాల జెడ్పి మాజీ చైర్ పర్సన్ వసంత ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్ గురుకులల బాట కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం అల్లీపూరు గ్రామంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. టిఆర్ఎస్ నాయకులను లోనికి రాకుండా గేట్లు వేసి పాఠశాల నిర్వాహకులు అడ్డగించడంతో గేటు ముందు కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు.అనంతరం ప్రహరీ గోడ నిర్మాణం పనులు పరిశీలించి విద్యార్థుల వసతులు,మధ్యాహ్న భోజనం ను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారని, దాదాపు 500 మంది విద్యార్థులు కలుషితమైన ఆహారం తిని తీవ్రంగా అనారోగ్యానికి గురయ్యారని విమర్శించారు.36 మంది విద్యార్థుల మరణాలకు కారణం రేవంత్ రెడ్డి సర్కార్ అని అన్నారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని అన్నారు. గురుకులాల్లో పేద పిల్లల ప్రాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రక్షణ లేదన్నారు.

నాసిరకమైన భోజనాన్ని పిల్లలకు పెట్టడంతో వారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని, హాస్టళ్లలో పాములు, ఎలుకలు ఉండడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యావ్యవస్థను రేవంత్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో రాయికల్ మండల పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేష్ ,మండల మహిళ అధ్యక్షురాలు స్పందన సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు,రాయికల్ పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మహేష్,మాజీ సర్పంచులు నీరటి శ్రీను , కొంపెల్లి రాజమౌళి,మాజీ దొంతి నాగరాజు, నాయకులు మోర వెంకటేశ్వర్లు, అనుమల్ల మహేష్, కంటే గంగారాం, మండల మైనార్టి సెల్ అధ్యక్షులు చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.





# నేటి నుంచి 9 వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు..

- జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి

ఈ నెల డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ శనివారం తెలిపారు.ఇందులోభాగంగా డిసెంబర్ 1న విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండవ దశ నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమాలు,పాఠశాల విద్యార్థులకు స్వీట్ల పంపిణీ,వ్యాసరచన పోటీలు, సీఎం కప్ పేరిట క్రీడ పోటీలు నిర్వహణ ఉంటుందని అన్నారు.

డిసెంబర్ 2 న 16 నర్సింగ్ కాలేజీలు,28 పారామెడికల్ కళాశాలలను,213 నూతన అంబులెన్స్ , 33 ట్రాన్స్ జెండర్ ల క్లినిక్ లు ప్రారంభిస్తారని అన్నారు.

డిసెంబర్ 3న హైదరాబాదులో నిర్మించిన అరంఘర్ నుంచి జూపార్క్ ఫ్లై ఓవర్,485 ఎం.ఎల్.డి సామర్థ్యం గల 6 ఎస్టిపి, రూ.150 కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనులు,రూ. 17 కోట్లతో చేపట్టిన వర్షపు నీరు నిల్వ స్ట్రక్చర్స్ ప్రారంభిస్తారని తెలిపారు. అదే సమయంలో కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ పనులు,రూ. 5942 కోట్లతో చేపట్టే హెచ్.సి.ఐ.టి.ఐ పనులు,రూ.586 కోట్లతో చేపట్టే ఎస్.ఎన్.డి.పి పనులు శంకుస్థాపన జరుగుతుందని అన్నారు.

ఇందులోభాగంగా మున్సిపాలిటీలలో కార్యాలయాల్లో విద్యుత్ దీపాలంకరణ చేయడం, మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ల నిర్వహణ, పారిశుధ్య సిబ్బందికి అవసరమైన సేఫ్టీ ఎక్విప్మెంట్, పిపిఈ పంపిణీ , అమృత పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు.

డిసెంబర్ 4న హైదరాబాదులో తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోనా నెక్ శంకుస్థాపన, వర్చువల్ సఫారీ థీం పార్క్, వృక్ష పరిచయ క్షేత్రం ప్రారంభిస్తారని, అదే రోజు సాయంత్రం పెద్దపల్లి జిల్లాలో బహిరంగ సభ నిర్వహించి 9007 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు.డిసెంబర్ 5న హైదరాబాద్ మాదాపూర్ లో మహిళా శక్తి బజార్ ప్రారంభోత్సవం, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం విజయాల పై శివశక్తి మహిళా సంఘాలలో చర్చ నిర్వహించాలని అన్నారు.

డిసెంబర్ 6న ఈ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం, 244 సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఉంటుందని అన్నారు.

డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాదులో ఘనంగా వేడుకలు జరుగుతాయని అన్నారు. డిసెంబర్ 7న స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, విద్యుత్ శాఖకు నూతన ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనాలు ప్రారంభిస్తామని అన్నారు.

డిసెంబర్ 8న ఏఐ నగరానికి శంకుస్థాపన, 7 నూతన ఏఐ ఇన్నిసేటివ్, 130 నూతన పౌర సర్వీసులు, కమలాపురం ఫ్యాక్టరీ పునరుద్ధరణ మొదలగు 15 పరిశ్రమలతో ఎమ్ఓయూలు, స్పోర్ట్ యూనివర్సిటీ కు శంకుస్థాపన ఉంటుందని, డిసెంబర్ 9న హైదరాబాద్ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని లక్ష మంది మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రజాపాలన ప్రజా దినోత్సవ కార్యక్రమాలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.



# గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా...

- మృతుని కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు..
- ఎన్ఆర్ఐ పాలసి కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదు..

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి

ఉపాధి కోసం గల్ఫ్ కి వెళ్ళిన వారిలో కొందరు కార్మికులు మృతి చెందగా వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్ లో జగిత్యాల రూరల్ మండలానికి చెందిన ఐదుగురు గల్ఫ్ కార్మికులు గల్ఫ్ లో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున 25 లక్షల రూపాయల విలువ గల ప్రొసీడింగ్ కాపీలను భాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.ఉపాధి నిమిత్తం గల్ఫ్ కి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల పరిహారం చాలా గొప్ప కార్యక్రమం అని అన్నారు.ఏడు గల్ఫ్ దేశాలలో మరణించిన గల్ఫ్ కార్మికులు ఆరు నెలల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవడంతో ఐదు లక్షలు పరిహారం అందుతుందని అన్నారు. గత దశాబ్ద కాలం నుండి గల్ఫ్ సంఘాల,ఎన్.ఆర్.ఐ సంఘాలు ఎన్.ఆర్.ఐ పాలసి కోసం అనేక మార్లు వినతి సమర్పించిన గత ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గల్ఫ్ కార్మికుల భాధలను అర్థం చేసుకొని రూ.5 లక్షలు అందజేయటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా భరోసా ఇచ్చారని అన్నారు.గురుకుల పాఠశాలలో కళాశాలలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రజా భవన్ లో ఎన్. ఆర్.ఐ సెల్ ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్ రావు ,మాజీ జెడ్పిటిసి ఎల్లారెడ్డి , నాయకులు బాల ముకుందం,గడ్డం నారాయణరెడ్డి, చెరుకు జాన్, చిర్ర నరేష్ ,రాజేశ్వర్ రెడ్డి, ప్రకాష్,రవీందర్ రావు, గుంటి రవి, శ్రీనివాసరావు, శాంతపు రావు,జైరాం సురేష్, వెంకటేష్ ,రాజు, మోహన్ రెడ్డి ,సునీల్ ,తదితరులు పాల్గొన్నారు.



## జీనియస్ దర్శకుడు సుకుమార్ నన్ను స్టార్‌ను చేశాడు: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

పుష్ప-2 ది రూల్ ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రమిది. ఇండియాస్ బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూడబోతున్నారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆయన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవబోతుంది. ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో అత్యున్నతంగా హై బడ్జెట్‌తో నిర్మించారు. డిసెంబరు 5న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్ర ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. అంతేకాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి ఈవెంట్ సన్సేషన్ అవుతుంది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన పుష్ప-2 ట్రైలర్ లాంచ్ వేడుక ఇండియా మొత్తం హాట్‌టాపిక్‌గా నిలిచింది. చెన్నయ్‌లో జరిగిన వైల్డ్ ఫైర్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌గా నిలిచింది. కొచ్చిలో జరిగిన గ్రాండ్ ఈవెంట్ కూడా అక్కడ కిక్కిరిసిన అభిమానుల సమక్షంలో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. తాజాగా ముంబయ్‌లో 'పుష్ప-2' హీరో, హీరోయిన్ నిర్మాతలు సందడి చేశారు. అక్కడ గ్రాండ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ '' ఈ సినిమా విషయంలో నేను థాంక్స్ చెప్పుకోవాల్సింది నిర్మాతలకు.. వాళ్లు లేకుంటే, వాళ్ల సపోర్ట్ లేకుండా ఈ సినిమా సాధ్యపడేది కాదు. ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడానిజీ, భరత్ భూషణ్‌లకు థ్యాంక్స్.. పుష్ప చిత్రాన్ని కోవిడ్ టైమ్‌లో చాలా ఛాలెంజ్‌లు ఫేస్ చేసి చేయాల్సి వచ్చింది. ఈ సందర్భంగా నా టెక్నిషియన్ల అందరికి కృతజ్ఞతలు. నా చిన్ననాటి స్నేహితుడు నా కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చిన దేవి శ్రీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే పుష్ప-2 నుంచి మరో సూపర్ సాంగ్ రాబోతుంది. ఈ పాటతో దేవి మ్యాజిక్ మరో సారి తెలుస్తుంది. అందరి హృదయాలను హత్తుకునే పాట అది. ఫహాద్ ఫాజిల్‌తో పనిచేయడం ఎంతో గ్రేట్‌గా వుంది. శ్రీలీల, రష్మికలతో పనిచేయడం ఎంతో హ్యాపీ. గత నాలుగు సంవత్సరాలుగా రష్మికతో కలిసి పనిచేశాను. ఆమెతో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స ఎంతో ఎనర్జీ వస్తుంది. చాలా పాజిటివ్ ఎనర్జీ ఉన్న హీరోయిన్. ఈ ప్రపంచంలో ఇలాంటి అమ్మాయిలు కావాలి అనిపించేంతగా రష్మిక గొప్పతనం కనిపిస్తుంది. నా జర్నీలో దర్శకుడు సుకుమార్‌తో 20 ఏళ్ల ప్రయాణం మొదలైంది. పుష్ప ఈ రోజు నేను హీరోగా ఇలా వున్నానంటే ఆయనే కారణం నన్ను స్టార్‌ను చేసింది సుకమారే. నా లైఫ్‌లో అత్యధిక భాగం.. హీరోగా నా ఎదుగుదల ఆయనకే చెందుతుంది. ఈ రోజు ఆయన రాలేదు కానీ ఈ రోజు కూడా చిన్న చిన్న మార్పుల కోసం సినిమాపై ఇంకా పనిచేస్తున్నాడు. ఈ సినిమా ఇంత డబ్బు వస్తుంది.. ఇంత పేరు వస్తుందని లెక్కలు వేసుకోని చేయలేదు. ప్రేక్షకులకు ఓ బెస్ట్ సినిమా ఇవ్వాలి. వాళ్లకు గొప్ప ఎక్స్‌పీరియన్స్ సినిమా ఇవ్వాలని వర్క్ చేశాం. ఐదు సంవత్సరాలు మా లైఫ్‌లో బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి ట్రై చేస్తున్నాం. బెస్ట్ సినిమా ఇస్తున్నాం. మేము పుష్ప పార్ట్-1 సాధారణ సినిమాగానే చేశాం. కానీ ప్రేక్షకులు తమ ఆదరణతో గొప్ప సినిమా చేశారు. ఈ రోజు పుష్ప-2 రూపంలో బిగ్గెస్ట్ ఇండియన్ సినిమా చేయడానికి కారణం మీ ఆదరణే. ఈ రోజు ప్రపంచంలోని ప్రతి దగ్గరి నుంచి, ప్రపంచంలో ప్రతి ఇండియన్, ప్రతి భాష వాళ్లు, ప్రతి రాష్ట్రంలోని వాళ్లు అందరూ కలిసి పుష్ప-2 విడుదలను సెలబ్రేట్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.



## మంచి సినిమా చేస్తే ప్రేక్షకుల ప్రేమను గెల్చుకోవచ్చు

థ్రిల్లర్ జానర్ లో ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్సిపీరియన్స్ ఇచ్చి ఘన విజయాన్ని అందుకుంది కిరణ్ అబ్బవరం మూవీ "క". ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటించారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ "క" సినిమాతో తమ ప్రతిభ నిరూపించుకున్నారు. "క" సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేయగా..మలయాళంలో స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై డిస్ట్రిబ్యూట్ చేశారు. దీపావళి బాక్సాఫీస్ రేసులో విన్నర్ గా నిలిచిన ఈ సినిమా వరల్డ్ వైడ్ 50 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఈటీవీ విన్ లో డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీతో స్ట్రీమింగ్ కు వచ్చి అక్కడా గ్రాండ్ సక్సెస్ అందుకుంది. అతి తక్కువ టైమ్ లో 100 మిలియన్ మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకుంది. ఈ సందర్భంగా "క" బ్లాక్ బస్టర్ ధమాకా ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ క సినిమాకు మేము ఎంతగా ప్రమోషన్ చేశామో, ఈటీవీ విన్ టీమ్ అంతా అంతే ప్రమోషన్ చేసి ఆడియెన్స్ కు సినిమా బాగా రీచ్ అయ్యేలా చేస్తున్నారు. పైరసీ అనేది జరగకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రతి ఒక్కరి ఇంటికి క సినిమాను చేర్చారు. ఈటీవీ విన్ టీమ్ బాపినీడు గారు, సాయి కృష్ణ ఇతర అందరికీ థ్యాంక్స్ చెబుతున్నాం. అలాగే డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ నుంచి ఓటీటీలోకి వచ్చిన ఫస్ట్ తెలుగు సినిమా క కావడం విశేషం. అందుకు చాలా సంతోషంగా ఉంది. డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీలో మా సినిమా మరింత డీటెయిలింగ్ గా సౌండ్, విజువల్స్ మరింతగా ఆకట్టుకుంటాయి. థియేటర్ లో క సినిమా చూసిన వాళ్లు కూడా మరోసారి ఈటీవీ విన్ లో చూడండి. ఎందుకంటే సెకండ్ టైమ్ ఇంకా బాగా అనిపించింది అని చాలామంది చెబుతున్నారు. క సినిమా సక్సెస్ కు మా ప్రొడ్యూసర్ గోపి గారు, డైరెక్టర్స్ సందీప్, సుజీత్, డిస్ట్రిబ్యూటర్ వంశీ గారు..ఇలా ప్రతి ఒక్కరూ కారణం. అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. మంచి సినిమా చేస్తే ఆడియెన్స్ ప్రేమను గెల్చుకోవచ్చు అనే ధైర్యాన్ని, నమ్మకాన్ని క సినిమా ఇచ్చింది. అన్నారు.



## స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' గా నభా నటేష్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ చేతుల మీదుగా నభా ఈ అవార్డ్ స్వీకరించారు. గ్లామర్ తో పాటు పర్ ఫార్మెన్స్ తో మెప్పించగల హీరోయిన్ గా పేరున్న నభా నటేష్ కు ఈ అవార్డ్ వెల్ డిసర్వడ్ అని అనుకోవచ్చు. స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్న నభా నటేష్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నభా లేటేస్ట్ గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. అలాగే రీసెంట్ గా నాగబంధం అనే పాన్ ఇండియా మూవీని స్టార్ట్ చేసింది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి.